వైభవంగా ఆంజనేయుని ఆలయ వార్షికోత్సవం

కలెక్టర్ హిమాన్షుశుక్లా ప్రత్యేక పూజలు



గొలకోటివారి పాలెంలో స్వామికి పూజలు చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

కొత్తపేట: మోడేకుర్రు శివారు గొలకోటి వారిపాలెంలో అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గొలకోటి మాధవ్ ఆధ్వర్యాన వేదపండితులు ముళ్లపూడి రామకృష్ణ పర్యవేక్షణలో విశేష పూజలు, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజల్లో కలెక్టర్ హిమాన్షుశుక్లా ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. తొలుత కలెక్టర్‌కు మాధవ్, గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, సత్కరించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ గొలకోటి నారాయణరావు ఆధ్వర్యంలో ప్రత్యేక సంకీర్తన, భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాట్యకళాకారిణి అలేఖ్య కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. అన్నసమారాధన జరిపారు. బాణసంచా కాల్పులు, కేరళ వాయిద్యాలు, హనుమంతుడు, శ్రీరామపట్టాభిషేకం ప్రదర్శన, విచిత్ర వేషధారణ, బుట్టబొమ్మలతో భారీ ఊరేగింపు అందరినీ అలరించాయి.

పి.గన్నవరంలో షూటింగ్ సందడి

పి.గన్నవరం: స్థానిక పాత అక్విడెక్టుపై శనివారం రాత్రి సినిమా షూటింగ్ జరిగింది. జీఏ 2 పిక్చర్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై నిర్మిస్తున్న సినిమాలో భాగంగా హీరో, హీరోయిన్‌లు నార్నే నితిన్, నయన్ సారికలపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. అంతకు ముందు ఉలిశెట్టివారిపాలెం చెరువు వద్ద షూటింగ్ జరిగింది. గత 48 రోజులుగా కోనసీమలోని పలు ప్రాంతాల్లో సినిమాను చిత్రీకరిస్తున్నట్టు డైరెక్టర్ అంజిబాబు కంచిపల్లి తెలిపారు. అల్లు అరవింద్ సమర్పణలో నిర్మిస్తున్న ఈ షూటింగ్ ఇప్పటి వరకూ 80 శాతం పూర్తయిందన్నారు. సినిమా నిర్మాత బన్నీ వాసు, తారాగణం వినోద్‌కుమార్, కె.రాజ్‌కుమార్, ఎ.కొయ్య, మైమ్ గోపి తదితరులు ఉన్నారు. పాటలు కె.శ్యామ్, శ్రీమణి, కెమెరామెన్ సమీర్‌కుమార్, మ్యూజిక్ డైరెక్టర్ రామ్ మిరియాల ఉన్నారు.

నివాస ప్రాంతాల్లో చెత్త డంపింగ్ వద్దు

అంబాజీపేట: నివాస ప్రాంతాల్లో చెత్తను డంపింగ్ చేయవద్దని, పంచాయతీ అధికారులు చెత్త పంపిస్తే అడ్డుకుంటామని హడ్కోకాలనీ, నెల్లివారిపేట వాసులు అన్నారు. అంబాజీపేట హడ్కో కాలనీకి వెళ్లే రహదారిలో కాలనీల వాసులు శనివారం రిలే దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో చెత్తను తరలించి డంపింగ్ చేయడం వల్ల చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఈ కాలనీల శివారు ప్రాంతంలో చెత వేయవద్దని అధికారులకు, ఎంపీ, ఎమ్మెల్యే, అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. పారిశుధ్య కార్మికులు ట్రాక్టర్లతో చెత్త తీసుకొస్తే అడ్డుకుంటామన్నారు. ఉన్నతా ధికారులు స్పందించి డంపింగ్‌ను నిలిపివేయాలని స్థానికులు నెల్లి బాలరాజు, ముమ్మిడివరపు వరప్రసాద్, క్రాప భాస్కరరావు, గోడి భాగ్యలక్ష్మి, గెడ్డం త్రివేణి తదితరులు అన్నారు.

కేశవదాసుపాలెంలో వై ఏపీ నీడ్స్ జగన్

సఖినేటిపల్లి: కేశవదాసుపాలెం పంచాయతీ వద్ద శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. వైస్ ఎంపీపీ రాపాక దీవెన కుమారి ముఖ్య అతిథిగా హాజరై జేసీఎస్ మండల ఇన్‌చార్జి నల్లి మోహన్‌తో కలిసి సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు యెనుముల చిట్టిబాబు ఎగుర వేశారు. పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ పెదపాటి నాగలక్ష్మి, సచివాలయ కన్వీనర్లు కొల్లాబత్తు చిట్టిబాబు, గన్నాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

మలికిపురం: విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంపొందింప చేసుకోవాలని రాజోలు కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీల రాణి అన్నారు. శనివారం స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టి.సతీష్ అధ్యక్షతన ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యాన రాజ్యాంగ రూపకల్పనకు జరిగిన కృషిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో రిసోర్స్ పర్సన్, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీల రాణి ముఖ్య అతిథిగా మాట్లాడారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎం.వి.సత్యనారాయణ మూర్తి, కోర్టు ఏపీపీ డి.భాస్కర్, సీనియర్ అడ్వొకేట్స్ పి.మేఖేల్, లక్ష్మి, సుధా, అధ్యాపకులు రమేష్‌బాబు, విజయ్‌కుమార్, రాజు, ఆనందమహాని, వెంకటరత్నం పాల్గొన్నారు.

వనవులమ్మకు బంగారు సూత్రాల సమర్పణ

అయినవిల్లి: విలస గ్రామ దేవత వనవులమ్మ అమ్మవారికి గ్రామస్తుడు మరువాడ సుబ్రహ్మణ్యశర్మ శనివారం ఒక కాసు బంగారు మంగళ సూత్రాలను సమర్పించారు. ఈ బంగారు మంగళ సూత్రాలను ఆలయ అర్చకులు మందపల్లి తేజకు అందజేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా మంగాదేవి

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా మలికిపురం ఈవోపీఆర్డీ బడుగు మంగాదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకూ ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేసిన జి.భీమారావు తిరిగి రాజోలు ఈవోపీఆర్డీగా వెళ్లారు. ఈ మేరకు పరిషత్ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ బీమా అందజేత

రావులపాలెం: స్థానిక గ్రామ సచివాలయం-1 పరిధిలో మృతి చెందిన మేక శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ. 10 వేలను శనివారం అందజేశారు. గ్రామ ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వార్డు సభ్యులు ద్వారంపూడి నాగతేజ భగవాన్‌రెడ్డి, సఖినేటి వాకుల రాజు, కార్యదర్శి ఎల్.దుర్గాప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ చేతుల మీదు మృతుని భార్య మేక రమణకు అందజేశారు.

జగన్‌తోనే గ్రామ స్వరాజ్యం సాధ్యం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అనురాధ

మామిడికుదురు: జాతిపిత మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, రాజోలు, పి.గన్నవరం ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. కొమరాడలో రూ.40 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎంపీ శనివారం ప్రారంభించారు. వలవల శ్రీరామమూర్తి, వెంకటేశ్వరమ్మ ఇచ్చిన స్థలంలో సచివాలయ భవనం నిర్మించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్‌లు వలవల కృష్ణవేణి, చుట్టుగుళ్ల లక్ష్మి, ఎంపీటీసీ వలవల పెదబాబు, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ ఖాదిర్, పీఏసీఎస్ చైర్మన్లు బొలిశెట్టి భగవాన్, కటకంశెట్టి ఆదిత్యకుమార్, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనిఖీ

రావులపాలెం: స్థానిక జూనియర్ కళాశాలను జిల్లా డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని ప్రతీ క్లాస్ రూమ్‌కి వెళ్లి గతంలో జరిగిన మూడు యూనిట్ల అర్ధ సంవత్సర పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. రాబోవు రోజుల్లో జరిగే పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించడానికి పలు సూచనలు చేశారు. కళాశాల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. అలాగే నాడు-నేడు పనులను పరిశీలించారు. ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కె.పెదపూడిలో చోరీ

అంబాజీపేట: ఇంటిలో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి బంగారు ఆభరణాలు అపహరించుకునిపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కె.పెదపూడికి చెందిన నూనె వెంకటలక్ష్మి ఈ నెల 24న తన పెద కుమార్తె ఇంటికి వెళ్లింది. తిరిగి శనివారం ఉదయం 10 గంటలకు ఇంటికి వచ్చే సరికి తలుపులు పగలగొట్టి ఉండటాన్ని గుర్తించింది. లోపలకు వెళ్లి చూడగా బీరువాలు పగలగొట్టి వస్తువులను చెల్లాచెదురుగా పడేసి, లోపల ఉన్న కాసు సూత్రాలు అపహరణకు గురైనట్టు గుర్తించారు. వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

ప్రతీ ధాన్యం గింజ కొనుగోలు చేస్తాం

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- చిరతపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



చిరతపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: రైతుల నుంచి ప్రతీ ధాన్యం గింజా కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చిరతపూడి సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శనివారం ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ బొంతు శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల గ్రీవెన్స్ కన్వీనర్ పేరి శ్రీనివాస్, సర్పంచ్ కోట బేబిరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, కడలి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లంక భూముల లీజు పట్టాల పంపిణీ

అంబాజీపేట: లబ్ధిదారులు మంజూరైన లంక భూములను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. తొండవరంలో ఐదేళ్ల పాటు లీజుకు మంజూరైన సీ క్లాస్ లంక భూములను 51 మంది లబ్ధిదారులకు సర్పంచ్ పేరాబత్తుల దొరద బాబు అధ్యక్షతన ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ఒక్కొక్కరికి అర ఎకరం చొప్పున 25 ఎకరాలు లీజు పట్టాలు ఇచ్చామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏడాదికి మాత్రమే లంక భూములను లీజుకు ఇచ్చేవారన్నారు. అర్హులను పక్కన పెట్టి వారికి కావల్సి వారికి మాత్రమే పట్టాలు ఇప్పించేవారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అర్హులైన వారిని గుర్తించి ఐదేళ్ల పాటు లంక భూములను సాగు చేసుకునేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, వాసంశెట్టి చినబాబు, పేరాబత్తుల కొండలరావు, మద్దింశెట్టి మల్లిబాబు, నాగాబత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: పేద రైతులకు ప్రభుత్వం ఐదేళ్ల లీజు కాల పరిమితితో లంక భూములకు పట్టాలను అందిస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మొండెపులంకలో 26.1 ఎకరాలను 75 మంది రైతులకు, పి.గన్నవరం, ఎల్.గన్నవరం గ్రామాలకు చెందిన 301 మంది రైతులకు 41.38 ఎకరాల లంకభూమిని ఐదేళ్ల లీజు పరిమితి పట్టాలను ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే చిట్టిబాబు, కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి మాట్లాడారు. డీటీ బి.గోపాలకృష్ణ, మండలశాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచులు గుడాల రామారావు, బొండాడ నాగమణి, ఎంపీటీసీ డ.మౌనిక, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- అంతర్వేదికరలో గడప గడపకూ మన ప్రభుత్వం



అంతర్వేదికరలో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు అందరూ కలిసి పనిచేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం అంతర్వేదికరలో ఎమ్మెల్యే రాపాక, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, గ్రామ శాఖ అధ్యక్షుడు కొల్లాబత్తుల ధర్మారావు, నాయకులు కేఎస్ఎన్ రాజు, గెద్దం అమ్ములు, బెల్లంకొండ సూరిబాబు, దూది త్రినాథ్, బెల్లంకొండ ఏసుబాబు, కుసుమ చింటూ, వీఆర్వో బొల్లాప్రగడ సీతారామం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

సఖినేటిపల్లి: తీరప్రాంత గ్రామాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం గొందిలో నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. వైస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజు, ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, సర్పంచ్ దొంపాటి రవికుమార్, పార్టీ మండల వైస్ ప్రెసిడెంట్ పెదపాటి నాగలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి దీపోత్సవం

అలమూరు: కార్తికమాస క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నర్సిపూడిలో 33వ కోటి దీపాల మహోత్సవం జరిగింది. స్థానిక ఊర చెరువు మధ్యలో నిర్మించిన శ్రీలక్ష్మీనారాయణ ఆలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కోటి దీపాల మహోత్సవానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నర్సిపూడి శ్రీలక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి